క్లుప్తంగా

నింద్ర ఎంఈఓగా వసుమతీదేవి



నింద్ర: మండల ఎంఈఓగా వసుమతి దేవి సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈమె సత్యవేడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్ఎంగా పని చేస్తూ, పదోన్నతిపై నింద్ర ఎంఈఓగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో విద్యావ్యవస్థను బలోపేతం చేస్తూ విద్యాభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.

రాగిపంట సాగుపై అవగాహన

పాలసముద్రం: రైతన్నలు రాగి పంట సాగుపై శ్రద్ధ పెట్టాలని ఏఓ డిల్లీప్రసాద్ తెలిపారు. సోమవారం పాలసముద్రం రైతు భరోసా కేంద్రంలో సిబ్బందితో పాటు రైతులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం 2023ను చిరుధాన్యాల సంవత్సరంగా నిర్ణయించిందని ఆర్‌బీకే సిబ్బంది తమ పరిధిలోని గ్రామాల్లో రైతులతో రాగి పంటను సాగుచేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. రాగి పంటకు గిట్టుబాటు ధర కిలో రూ.38 నిర్ణయించడం జరిగిందని రైతులకు తెలిపారు. రాగి సాగు ఖర్చులు తక్కువ, దిగుబడి ఆదాయం చాలా ఎక్కువన్నారు. రైతులు చిరుధాన్యాల సాగుపై శ్రద్ధ పెట్టాలని కోరారు. కార్యక్రమంలో రైతు భరోసా సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

క్రీడల్లో యువత ప్రతిభ చూపాలి



క్రీడలను ప్రారంభిస్తున్న రాఘుసందేష్

నింద్ర: గ్రామీణ ప్రాంతాల్లో యువత క్రీడల పట్ల ఆసక్తి చూపాలని సుప్రీంకోర్టు న్యాయవ్యాది రాఘుసందేష్ అన్నారు. సోమవారం మండలంలోని కొప్పేడు గ్రామంలో ఫ్రెండ్స్ కబడ్డీ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులు, యువత క్రీడల్లో పాల్గొని ప్రతిభ చూపాలన్నారు. ప్రథమ బహుమతి రూ.20 వేలు, అదేవిధంగా ద్వితీయ బహుమతి రూ.15 వేలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శ్యామ్‌లాల్, తృతీయ బహుమతి శ్రావణ్‌కుమార్ అందించడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో స్థానిక క్రీడాకారులు పాల్గొన్నారు.

ద్రౌపదీదేవికి మరు పొంగళ్లు



పొంగళ్లు తీసుకెళ్తున్న మహిళలు

వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లం ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో సోమవారం సాయంత్రం అమ్మవారికి పొంగళ్లు పెట్టి నైవేద్యంగా సమర్పించారు. ఆలయంలో గత 10 రోజులుగా జరిగిన వార్షిక మహోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఈ నేపథ్యంలో సోమవారం మహిళలు పెద్దఎత్తున మరు పొంగళ్లు పెట్టారు. పలు గ్రామాల నుంచి మహిళలు ఆలయానికి చేరుకుని ప్రసాదాలు వండి అమ్మవారికి సమర్పించారు. అంతకుముందు అమ్మవారిని ఆకర్షణీయంగా అలంకరించి భక్తిప్రపత్తులతో విశేష పూజలు నిర్వహించారు. అలాగే అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలను ఆలయ నిర్వాహకులు వేలం వేశారు.

పాముకాటుతో మహిళ మృతి



కుముద (ఫైల్)

పాలసముద్రం: మండలంలోని వెంగళరాజు కుప్పం పంచాయతీ కన్నికాపురం దళితవాడలో కుముద పాముకాటుకు గురై మృతి చెందిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. వివరాలు.. కన్నికాపురం దళితవాడకు చెందిన రామదాసు భార్య కుముద, ఇద్దరు పిల్లలతో కలిసి ఇంట్లో నిద్రిస్తుండగా కుముద చేతిపై విషపురుగు కొరికినట్లు చెప్పింది. వెంటనే భర్త స్వగ్రామంలోని ఆటోలో చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గంగాధరనెల్లూరు దగ్గరకు వెళ్లగానే ముక్కు, నోటిలో నుంచి బురుగు వచ్చింది. అయితే ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా వైద్యులు పరిశీలించి మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలికి కొడుకు, కూతురు ఉన్నారు. తల్లి మృతి చెందడంతో చిన్నారులు కన్నీరు మున్నీరయ్యారు.

ఎంఈఓగా మహేశ్వరరావు



ఎంఈఓలను సత్కరిస్తున్న ఎస్టీయూ నాయకులు

వెదురుకుప్పం: మండల విద్యాశాఖ అధికారిగా టి. మహేశ్వర రావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కడప జిల్లా రైల్వేకోడూరు జెడ్పీ హైస్కూల్‌లో హెచ్ఎంగా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడకు ఎంఈఓ-1గా వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో విద్యాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని చెప్పారు. అనంతరం ఎంఈఓ మహేశ్వరరావుతో పాటు ఎంఈఓ-2 దామోదర్‌ను ఎస్టీయూ నాయకులు ఘనంగా సత్కరించారు.

జగనన్న సురక్షతో విప్లవాత్మక మార్పు

- ప్రజలకు రక్షగా జగనన్న సురక్ష
- క్యాంపుల వద్దకు భారీగా తరలివస్తున్న జనం
- ఎక్కడికక్కడే సమస్యలు పరిష్కారం





ధ్రువీకరణ పత్రాలు అందుకున్న వారితో మంత్రి సోదరుడు, మున్సిపల్ చైర్మన్, క్యాంపునకు హాజరైన లబ్ధిదారులు

నగరి: జగనన్న సురక్ష కార్యక్రమంలో పల్లె, పట్టణాల్లో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిందని మంత్రి ఆర్‌కే రోజా సోదరుడు రామ్‌ప్రసాద్ రెడ్డి అన్నారు. సోమవారం 3, 4, 5 వార్డులకు సంబంధించి ఓంశక్తి ఆలయం వద్ద గల సచివాలయ పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘంతో కలిసి అర్హులైన లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, రేషన్ కార్డుల్లో మార్పులు వంటివి చాలా సులభతరం చేస్తూ ప్రభుత్వ వ్యవస్థను ప్రజల చెంతకు చేరవేసిందన్నారు. అర్హులైన ఏ ఒక్కరూ లబ్ధి పొందకుండా మిగిలి పోకూడదన్న లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమం ప్రవేశ పెట్టారన్నారు. ప్రజలకు జవాబుదారీతనంగా ఉండాలన్న లక్ష్యంతో జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా సత్వరమే 11 సేవలు ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో నెల రోజుల పాటు కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. సర్వీస్ చార్జీ లేకుండా ఉచితంగానే ధ్రువపత్రాలు అందజేస్తున్నట్లు తెలిపారు. 3, 4, 5 వార్డులకు సంబంధించి కుల ధ్రువీకరణ పత్రాలు 177 మందికి, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు 184 మందికి, ఆధార్ మొబైల్ లింకింగ్ 22 మందికి, రేషన్‌కార్డుల్లో మార్పులు 15 మందికి, వివాహ రిజిస్ట్రేషన్ ధ్రువీకరణ పత్రాలను ఎలాంటి రుసుము లేకుండా అందించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బాలన్, మున్సిపల్ సచివాలయ కార్యదర్శి దయానిధి, కౌన్సిలర్లు గోపాల్‌రెడ్డి, మునికృష్ణారెడ్డి, బీడీ భాస్కర్, ఇంద్రయ్య, మోహన్‌రాజ్, భూపాలన్, డీఈ నరేష్, హాస్పిటల్ కమిటీ డైరెక్టర్ కృష్ణమూర్తి, నాయకులు బాబురెడ్డి, ఎల్లప్పరెడ్డి, తేన్‌మొళి, ఇలంగో, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

విజయపురంలో..

విజయపురం: జగనన్న సురక్ష పథకం ప్రతి ఒక్కరికీ శ్రీరామరక్షగా పని చేస్తుందని మంత్రి ఆర్‌కే రోజా సోదరుడు రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. కార్యక్రమ ప్రత్యేకాధికారి ప్రసాద్ అధ్యక్షతన సోమవారం ఆలపాకం సచివాలయ పరిధిలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన అక్కడికక్కడే 85 కుల, ఆదాయం



సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న రాంప్రసాద్‌రెడ్డి

సరిఫ్టికెట్లు, 7 రేషన్‌కార్డులు, 1 ఆరోగ్యశ్రీకార్డు, 159 ఆధార్ లింకింగ్ అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకట్రాయులు, ఎంపీటీసీ అంబిక, సర్పంచ్‌లు బాబు, కుమార్, మాజీ సర్పంచ్ కుమార్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ముగ్గురికి ధ్రువీకరణ పత్రాలు



నా పేరు కెఎస్ యశోద. 3వ వార్డు, నగరి మున్సిపాలిటీ. మా ఇంట్లో ముగ్గురం ఈ రోజు ఆదాయ ధ్రువీకరణ పత్రం అందుకున్నాం. వలంటీరు, గృహసారథి, కౌన్సిలర్, సచివాలయ సిబ్బంది అందరూ మా ఇంటి వద్దకు విచ్చేసి 11 సర్వీసులు ఉచితంగా చేస్తున్నాం. మీకు ఏది అవసరమో చెప్పండని అడిగి మరీ సర్టిఫికెట్లు ఇచ్చారు. ఎలాంటి రుసుము లేకుండా మాకు సర్టిఫికెట్ అందింది. ఇంతసాయం అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి, మంత్రి రోజమ్మకు ధన్యవాదాలు.

ఈ పాలనలోనే సాయం అందుతోంది..



నా పేరు కాంచన, 4వ వార్డు, నగరి మున్సిపాలిటీ. మా కుటుంబానికి సాయం అంటూ అందుతోందంటే అది జగనన్న ప్రభుత్వంలోనే. ఇంటికే వచ్చి ఆరా తీసి మరీ సాయం అందిస్తున్నారు. ఇప్పటికే అమ్మఒడి వస్తోంది. పాఠశాలలో మంచి భోజనం పెడుతున్నారు. నేడు ఉచితంగా ఆదాయ ధ్రువీకరణ పత్రం ఇచ్చారు. సహాయం అందుతోంటే అది జగనన్న పాలనలోనే. ఇంతటి సాయం అందిస్తున్న ముఖ్యమంత్రి జగనన్నకు, మంత్రి ఆర్‌కే రోజాకు ధన్యవాదాలు.

జగనన్నే బెస్ట్ సీఎం..



నా పేరు డి.దీప, 3వ వార్డు, నగరి మున్సిపాలిటీ. కులధ్రువీకరణ పత్రం కోసం అందరూ ఎంతగా తిరుగుతున్నారు ? కష్టపడుతున్నారన్నది ప్రత్యక్షంగా చూశాను. నేడు మా కుటుంబంలోని 5 గురికి కులధ్రువీకరణ పత్రం కోసం నిన్నే విన్నవించుకున్నాను. ఈరోజు ఎలాంటి కష్టం లేకుండా సర్టిఫికెట్లు ఉచితంగా పొందాను. ఇప్పటికే అమ్మఒడి, చేయూత, ఆసరా పథకం కింద లబ్ధి చేకూరింది. ఇంత మంచి చేస్తున్న ఆయనే నా దృష్టిలో బెస్ట్ సీఎం.

మంచి ఎవరు చేస్తున్నారో తెలుసు..!



నా పేరు టి.కళావతి, 3వ వార్డు, నగరి మున్సిపాలిటి. నేడు ఉచితంగా సర్టిఫికెట్ అందుకున్నాను. ఒకటా.. రెండా.. మహిళలకు ముఖ్యమంత్రి జగనన్న చేస్తున్న మంచి అంతా ఇంతా కాదు. మా పిల్లలు చదివే పాఠశాల సుందరంగా మార్చారు. ప్రతిరోజు ఇంటికి వచ్చే పిల్లలు పాఠశాలలో అన్నం బాగుందని చెప్పడం ఎంతో సంతోషాన్ని ఇస్తోంది. వారికి అమ్మఒడి వస్తోంది. నేడు సర్టిఫికెట్లు కూడా ఉచితంగా ఇస్తున్నారు. ఇంత కన్నా లబ్ధి ఏ ప్రభుత్వం చేయలేదు. ఇది ప్రతి మహిళా గుర్తిస్తుంది.

బాలగురునాథీశ్వరుడికి ప్రత్యేక పూజలు



స్వామివారికి హారతి ఇచ్చి పూజలు ఇస్తున్న ఆలయ అర్చకుడు

పాలసముద్రం: మండలంలోని రాచపాళెం గ్రామంలో వెలసిన బాలగురునాథీశ్వర స్వామికి సోమవారం పౌర్ణమి సందర్భంగా గ్రామస్తులు వివిధ అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం స్వామివారిని వివిధ అభిషేకాలు చేసి పూజలు చేశారు. మధ్యాహ్నం స్వామివారికి కావలసిన పూజసామగ్రిని మంగళ వాయిద్యాలతో గ్రామాల్లో ఊరేగించి స్వామివారికి సమర్పించారు. వేదపండితులు స్వామివారిని భక్తులు తీసుకొచ్చిన పూజసామగ్రితో సుందరంగా అలంకరించి ప్రత్యేక దీపారాధనలు, పూజలు చేశారు. పుత్రసంతానం, మాంగళ్యభాగ్యం లేని మహిళలు స్వామివారి ఆలయంలో పిండిదీపాలు గెలిగించి స్వామివారిని దర్శించారు.

చిత్తశుద్ధితో జగనన్న సురక్ష అమలు

పుత్తూరు రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష పథకాన్ని చిత్తశుద్ధితో అమలు చేయాలని ఎఫ్‌టీపీఏ, ఎంఎల్‌టీ దిలిప్ మొదలి సూచించారు. సోమవారం పుత్తూరు రూరల్ మండలం, వేపగుంట, ఉత్తరపుకండ్రిగ సచివాలయ పరిధిలోని వలంటీర్లు, గృహసారథులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలు పొందడంలో అర్హత ఉండి పొందలేకపోయిన వారిని గుర్తించి వారికి లబ్ధి చేకూర్చడమే ఈ జగనన్న సురక్ష పథక లక్ష్యమని వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ మునివేలు, సర్పంచ్ గిరిజా ప్రసాద్, ఉపసర్పంచ్ ఉదయ్‌కుమార్, కన్వీనర్లు, నరసింహ, నవీన్, పుష్పలత, నాయకులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనను విజయవంతం చేద్దాం



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి

– డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి

శ్రీరంగరాజపురం: జిల్లాకే తలమానికమైన చిత్తూరు విజయా డెయిరీ ప్రారంభోత్సవానికి విచ్చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మంగళవారం నాటి జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి అన్నారు. మండలంలోని 49 కొత్తపల్లిమిట్ట దీపిక కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి మండల కన్వీనర్లు, ప్రజాప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో జరిగిన సమావేశంలో వారు సీఎం పర్యటనపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం నారాయణస్వామి మాట్లాడుతూ గతంలో సీఎంగా ఉన్న చంద్రబాబు నాయుడు తన సొంత సంస్థ అయిన హెరిటేజ్ డెయిరీ కోసం దేశంలోనే రెండో అతిపెద్ద పాల డెయిరీగా పేరున్న చిత్తూరు విజయా డెయిరీని ఒక పథకం ప్రకారం నిర్వీర్యం చేసి ఆర్థిక నష్టాలు వచ్చేలా చేశాడని ఆరోపించారు. చివరికి రైతులకు కూడా బకాయిలు చెల్లించలేని స్థితికి తీసుకువచ్చి 2002 ఆగస్టు 31న ఎలాంటి నోటీసు ఇవ్వకుండా చంద్రబాబు నాయుడు విజయా డెయిరీని మూసేయించాడని దుయ్యబట్టారు. గత 2019 ఎన్నికల సమయంలో విజయా డెయిరీని ప్రారంభిస్తామని పాడి రైతులకు నాడు ఇచ్చిన హామీ మేరకు సీఎం జగనన్న మంగళవారం జిల్లాకే తలమానికమైన కొన్ని దశాబ్దాల సమస్యను ఉన్న పాడి రైతులకు జీవనాడిగా భావించే విజయా డెయిరీకి శంకుస్థాపన చేయనున్నారు. అలాగే చిత్తూరు జిల్లా కేంద్రంలో యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని విద్యార్థులు, ప్రజాసంఘాలు, మేధావులు డిమాండ్ చేస్తున్నారని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి యూనివర్సిటీ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. అలాగే పోలీస్ మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభను విజయవంతం చేయాలన్నారు. నియోజకవర్గానికి 154 బస్సులను కేటాయించడం జరిగిందన్నారు. అనంతరం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమానికి నియోజకవర్గ మండల కన్వీనర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, గృహసారథులు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరి



వృద్ధులకు అన్నదానం చేస్తున్న ప్రిన్సిపల్ ఝాన్సీరాణి

కార్వేటినగరం: వృద్ధులకు వ్యక్తిగత పరిశుభ్రత ఎంతో అవసరమని పుత్తూరు కేకేసీ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఝాన్సీరాణి అన్నారు. సోమవారం కార్వేటినగరంలో రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలో ఎన్ఎస్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ యోగా, ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. అనంతరం వృద్ధులకు టవళ్లు(కండువాలు), పండ్లు, స్వీట్లను పంచిపెట్టారు. అలాగే మధ్యాహ్నం అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో రాస్ కోఆర్డినేటర్ ప్రకాష్, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా కుంభాభిషేకం వేడుకలు

నగరి: మున్సిపల్ పరిధిలోని కాకవేడు ఆదిఆంధ్ర వాడలో స్థానికుల కోరిక మేరకు మంత్రి ఆర్‌కే రోజా మాతమ్మ ఆలయ నిర్మాణానికి టీటీడీ నిధులు రూ.10 లక్షలు మంజూరు చేయించారు. ఆ నిధులతో నిర్మించిన మాతమ్మ ఆలయ కుంభాభిషేక వేడుకలు మూడురోజుల పాటు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా తొలిరోజు నిర్వహించిన యాగశాల పూజలకు మంత్రి ఆర్కేరోజా సోదరుడు రామ్‌ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు ఎల్లప్ప రెడ్డి, పార్టీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు చిలకం రామచంద్రారెడ్డి



చిలకం రామచంద్రారెడ్డి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న బీజేపీ నేతలు

విజయపురం (నగరి): బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు చిలకం రామచంద్రారెడ్డి చిరస్మరణీయుడని రాష్ట్ర బీజేపీ నాయకుడు ఈశ్వరప్రసాద్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన స్వగ్రామంలో ద్వితీయ వర్ధంతి పురస్కరించుకుని పలువురు నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గ్రామ సర్పంచ్‌గా రాజకీయాల్లో అడుగుపెట్టిన చిలకం రామచంద్రారెడ్డి, అనతికాలంలోనే సమితి అధ్యక్షుడిగా, బీజేపీలో వివిధ విభాగాల్లో పని చేసి ఉమ్మడి రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా రెండు పర్యాయాలు పని చేశారని గుర్తు చేశారు. విజయపురం మండలాభివృద్ధికి ఆయన ఎంతో కృషి చేశారని వారు కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సోమనాథం, నాయకులు నాయరాణస్వామి నాయుడు, రమేష్, యుగంధర్‌రాజు, పురుషోత్తంరెడ్డి, జలజాక్షి, తదితరులు పాల్గొన్నారు.

రూ.76.90 లక్షలతో వాటర్ ట్యాంకుల నిర్మాణం



ముస్లిం కాలనీలో ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎంపీపీ లత

కార్వేటినగరం: గ్రామాల్లో తాగునీటి సమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ లత అన్నారు. సోమవారం ముస్లిం కాలనీకి మేజర్ పంచాయతీ సర్పంచ్ ధనంజయవర్మ ఆధ్వర్యంలో తాగునీటిని అందించేందుకు కోసం ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ట్యాంకులు నిర్మిస్తున్నామని చెప్పారు. గత టీడీపీ పాలనలో ముస్లిం కాలనీలో సమస్యలను పరిష్కరించడంలో మీన మేషాలు వేశారని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో వచ్చాక ముస్లింల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందన్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి చొరవతో నేడు ముస్లిం కాలనీలో రూ.38.45 లక్షలతో ట్యాంకు నిర్మిస్తామని, అలాగే పారిశుధ్య లోపంతో బాధపడుతున్న కాలనీ వాసులకు మురుగునీటి కాలువలు నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. అలాగే ఆర్కేఎస్సార్ ప్రభుత్వం ఉన్నత పాఠశాల ఆవరణంలో కూడా రూ.38.45 లక్షలతో తాగునీటి ట్యాంకు నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, రాష్ట్ర మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి హమీద్‌ఖాన్, కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, సోషల్ మీడియా మండల కన్వీనర్ రఫీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గిరి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.


చిదా యాజమాన్యంపై కలెక్టర్‌కు ఫిర్యాదు



తిరుపతి కలెక్టరేట్ వద్ద కార్మికుల నిరసన

పుత్తూరు రూరల్: స్థానిక చిదా స్పిన్నింగ్ మిల్లు యాజమాన్యం అక్రమంగా విక్రయిస్తున్న ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని కోరుతూ సోమవారం తిరుపతి జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో కార్మికులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ కార్యదర్శి ఏ.బాబు మాట్లాడుతూ నందిమంగళం లెక్క దాఖలా సర్వే నంబర్ 31/1లో నోషనల్ ఖాతా నెంబర్ 300009లో 2.83 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని తెలిపారు. సదరు భూమిపై బ్యాంకు నుంచి పెద్దమొత్తంలో రుణాలు సైతం పొందారని చెప్పారు. ఫ్యాక్టరీకి చెందిన భూమితో పాటు వివాదాస్పద ప్రభుత్వ భూమిని సైతం అక్రమంగా విక్రయిస్తున్నారని ఆరోపించారు. రూ.కోట్లు విలువ చేసే సదరు భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని ప్రభుత్వ అవసరాలకు వినియోగించాలని కోరారు. అలాగే చట్ట వ్యతిరేకంగా, ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా మిల్లులను మూసివేశారని చెప్పారు. కార్మికులకు న్యాయ పరమైన పరిహారం (రిట్రెంచ్‌మెంట్ బెనిఫెట్స్) చెల్లించలేదని ఆరోపించారు. అన్ని విషయాలపై సమగ్ర విచారణ జరిపి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. ఈ మేరకు వారు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు ఏలుమలైరెడ్డి, శివలింగం, రమేష్, సారకాయలు, మురగారెడ్డి, నాగూర్, రవిచంద్ర పాల్గొన్నారు.

సమష్టిగా పని చేయండి




సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ లత

కార్వేటినగరం: అధికారులు, ప్రజా ప్రతినిధులు సమష్టిగా పని చేసినప్పుడే మండలం అభివృద్ధి బాటలో ఉంటుందని ఎంపీపీ లత అన్నారు. సోమవారం వెలుగు కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు లేవనెత్తిన సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని సూచించారు. అనంతరం వ్యవసాయ అధికారి హేమలత మాట్లాడుతూ రాగి సాగు పెంచే విధంగా ఆర్బీకే సిబ్బంది రైతులకు అవగాహన కల్పించాలన్నారు. హౌసింగ్ ఏఈ యోగేంద్రనాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గిరీష మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో తాగునీటి సౌకర్యంతో పాటు మురుగునీటి కాలువలు నిర్మాణాలు చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు కార్తీక్‌రెడ్డి, మణెమ్మ, మండల కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు లోకనాథరెడ్డి, సర్పంచ్ ధనంజయవర్మ, తహసీల్దార్ రవికుమార్ రాజు, ఎంఈఓ మనోజ్‌కుమార్, డాక్టర్ గోపీనాథ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

గురుదేవో మహేశ్వరః



నగరి: సాయి దివ్యధామంలో ప్రత్యేక అలంకరణలో సాయినాథుడు



ప్రత్యేక అలంకరణలో సాయిబాబా



నింద్రలో..

నగరి: మున్సిపల్, మండల పరిధిలోని సాయినాథుని ఆలయాల్లో గురుపూర్ణిమ ఉత్సవాలు సోమవారం నేత్రపర్వంగా జరిగాయి. బేరివీధిలోని షిరిడి సత్యసాయి ఆలయంలో మహా పాలాభిషేకం కార్యక్రమం నిర్వహించారు. ఉదయం ఓంకారం కాగడ హారతి ఇచ్చి బాబాను మేల్కొల్పారు. హారతి పూజల్లో పలువురు భక్తులు పాల్గొని సాయినాథుని దర్శించుకున్నారు. అనంతరం శ్రీ షిర్డీ సాయిబాబా విగ్రహానికి భక్తులు స్వహస్తాలతో పాలాభిషేకం చేశారు. సాయి భజనమండలి సభ్యులు మురళీధర్, లీలావతమ్మ ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు. పట్టణ పరిధిలోని రాజీవనగర్ గుట్టపై నిర్మించిన షిర్డీసాయి ఆలయాన్ని పుష్పాలంకరణ చేపట్టారు. ఉదయం కాగడ హారతితో గురుపూర్ణిమ పూజలు ప్రారంభించారు. పట్టువస్త్రాలు, రుద్రాక్ష, చందన, ముత్యపు దండలతో, వెండి కిరీటంతో అలంకరించారు. కీళపట్టు చంద్రమౌళీశ్వర ఆలయంలో గురుపూర్ణిమను పురస్కరించుకుని దక్షిణామూర్తి, షిర్డీసాయి, కంచి మహాపెరియార్, జయేంద్రసరస్వతి విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో అన్నదానం చేశారు.

వేడుకగా గురుపౌర్ణమి పూజలు

పుత్తూరు రూరల్: పట్టణంలోని శ్రీషిర్డీ సాయిబాబా ఆలయంలో సోమవారం గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం 6 గంటలకు కాగడ హారతి, 7 గంటలకు బాబాకు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు సంధ్య హారతిచ్చారు. అనంతరం బాబాను పట్టణ పురవీధుల్లో ఊరేగించారు.

శ్రీకృష్ణుడికి పౌర్ణమి హారతులు..

పట్టణంలోని శ్రీకామాక్షీ సమేత శ్రీసదాశివేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని గీతామందిరంలో వెలసిన శ్రీకృష్ణ పరమాత్మకు పౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, అలంకరణలు చేశారు.

నింద్రలో..

నింద్ర: మండలంలోని కూనమరాజు పాళెంలో శ్రీమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో సోమవారం గురుపౌర్ణమి పూజలు వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో అభిషేకాలు, లక్ష్మీనారాయణ హోమం, పూర్ణాహుతి, పంచహారతులు ఇచ్చారు. మధ్యాహ్నం అన్నదానం చేపట్టారు.



కార్వేటినగరం: వ్రతంలో పాల్గొన్న దంపతులు

కార్వేటినగరంలో..

కార్వేటినగరం: బాలాజీ కాలనీలో వెలసిన శ్రీషిర్డీ సాయినాథుని ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చనలు, అభిషేకాలు చేపట్టారు. అన్నప్రసాదాలను అందించారు. ఆలయ అధ్యక్షుడు బాలాజీ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

హత్య కేసు దర్యాప్తు ముమ్మరం



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ

పుత్తూరు రూరల్: వైఎస్సార్‌సీపీ నేత టి.భక్తవత్సలం మృతి నేపథ్యంలో పుత్తూరు డీఎస్పీ శ్రీనివాసరావు సోమవారం సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. వడమాలపేట ఎస్ఐ రామాంజనేయులుతో కలిసి మృతదేహం లభ్యమైన కదిరిమంగళం పొలాలు, పరిసరాలను పరిశీలించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ మృతుడు భక్తవత్సలం చిత్తూరు జిల్లా తవణంపల్లి మండలం వెంగంపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడిగా గుర్తించినట్లు తెలిపారు. క్లూస్ టీమ్‌తో సంఘటనా స్థలంలో ఆధారాల కోసం క్షుణ్ణంగా అన్వేషించామన్నారు. అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నామని, అయితే ఇది రాజకీయ పార్టీ గొడవల వల్ల జరిగిన హత్యగా భావించడం లేదని వారు స్పష్టం చేశారు. ఇప్పటివరకు జరిపిన దర్యాప్తులో మృతుడు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటాడని తెలిపారు. ఇతనిపై కొందరు ఆర్థిక పరమైన ఫిర్యాదులు చేసినట్లు సమాచారం ఉందన్నారు. ఈ కోణంలో పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

పందులు కనిపిస్తే ఉపేక్షించం

నగరి: పట్టణంలో పందుల పెంపకందారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి సోమవారం తీవ్ర హెచ్చరికలు జారీచేశారు. నగరి పట్టణంలోని పందుల పెంపకందారులతో సమావేశం నిర్వహించారు. పందుల పెంపకం యాజమానుల నిర్లక్ష్యం వల్ల ఎక్కువ సంఖ్యలో పందులు రోడ్లపై, వీధులు, రద్దీగా ఉండే ప్రాంతాల్లో సంచరిస్తుండడంతో పట్టణ ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని తెలిపారు. ఈ నెల 6వ తేదీ నుంచి పందులు పట్టణ పరిధిలో సంచరిస్తే యజమానుల ప్రమేయం లేకుండా మున్సిపల్ సిబ్బంది వాటిని దూరంగా వదిలేస్తామన్నారు. అందుకు పురపాలక సంఘం వారు బాధ్యులు కారని తెలిపారు.